పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

• ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

గద్వాల, ఆగస్టు 24 : పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల పట్టణంతోపాటు గద్వాల, ధరూర్, కేటీదొడ్డి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గద్వాల పట్టణ, మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు, ధరూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి, కేటీదొడ్డి మండలంలో తొమ్మిది మందికి చెక్కులను అందజేశామన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండలానికి చెందిన 38 మంది బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10.23లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, కృష్ణ, నాయకులు గడ్డంకృష్ణారెడ్డి, జంబురామన్‌గౌడ్, రాధాకృష్ణారెడ్డి, ప్రతాప్‌గౌడ్, రమేశ్‌నాయుడు, రామకృష్ణనాయుడు, చక్రధర్‌రావు, నిలేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గోవిందు, నర్సింహులు, కురుమన్న, పటేల్‌ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, సత్యనారాయణ, రఘుకుమార్‌శెట్టి, గోపిరెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 24 : మండలంలోని రాయినిపేట తండాకు చెందిన కిషన్‌నాయక్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందారు. బాధితుడు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.60 వేలు మంజూరైన చెక్కును శనివారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీను, బీచుపల్లియాదవ్, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

ఖిల్లాఘణపురంలో..

ఖిల్లాఘణపురం, ఆగస్టు 24 : మండలంలోని సల్కలాపూర్ గ్రామానికి చెందిన బి.శంకరమ్మ, పి.శంకర్‌నాయక్, తూడి నరేందర్‌రెడ్డిలకు శనివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకుడు సాయిచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, చిన్న వెంకటయ్య, శేఖర్‌రెడ్డి, కర్రెన్న తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో కిరాణ షాపు దగ్ధం

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

వనపర్తిటౌన్, ఆగస్టు 24 : జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తాలో శ్రీరామాంజనేయ కిరాణం షాపు శుక్రవారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈ ఘటనలో దాదాపు రూ.22లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు కిరాణ షాపు యజమాని కృష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రూ.22లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు ఎమ్మెల్యేతో షాపు యజమాని మొరపెట్టుకున్నాడు. వెంటనే ఎమ్మెల్యే రూ.10వేల ఆర్థిక సాయాన్ని కృష్ణకు అందజేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు పట్టణ ఎస్సై జయన్న ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ కృష్ణ, నాయకులు కృష్ణ, కమ్మర్‌మియా, చందర్, రాజు, ప్రకాశ్ పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో సరిత

మల్దకల్/గద్వాల రూరల్, ఆగస్టు 24 : ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు కాంగ్రెస్ నాయకుడు తాటికుంట రామచంద్రారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా గద్వాల మండలంలోని గుర్రంగడ్డ గ్రామాన్ని శనివారం మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సందర్శించారు. గ్రామంలోని నడిగడ్డ ఇలవెల్పు జములమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌బాబు, వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, చిన్న కిష్టన్న, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

అయిజ, ఆగస్టు 24 : గద్వాల డిపో ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ తమ నిజాయితీని చాటుకున్నారు. శనివారం గద్వాల నుంచి అయిజకు వచ్చిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 33 టీ0494)లో ఓ మహిళా అయిజ పట్టణానికి చేరుకున్నది. బస్సు దిగే క్రమంలో తన పర్స్‌ను బస్సులోనే మర్చిపోయి దిగిపోయింది. వెంటనే తేరుకున్న ప్రయాణికురాలు ఆర్టీసీ డిపోకు సమాచారం చేరవేసింది. దీంతో అప్రమత్తమైన బస్సులోని కండక్టర్, డ్రైవర్ పర్స్‌ను భద్రపర్చారు. తిరిగి అయిజకు వచ్చిన డ్రైవర్, కండక్టర్లు మహిళ వివరాలు తెలుసుకొని పర్స్‌ను అందజేశారు. పర్స్‌లో విలువైన వస్తువులతోపాటు 5వేల నగదు ఉన్నట్లు మహిళ తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికురాలు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్ కృష్ణ, కండక్టర్, డ్రైవర్ ఉన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

• కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్

వనపర్తి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ భూహక్కుల రికార్డు ముసాయిదా చట్టం 2024లో చేయాల్సిన మార్పు చేర్పులపై ప్రజలు ఇచ్చే సలహాలు.. సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కొత్త(ఆర్వోఆర్ బిల్లు-2024)తెలంగాణ భూ హక్కుల రికార్డు ముసాయిదా చట్టం-2024పై సలహాలు, సూచనలు చేసేందుకు న్యాయవాదులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి, మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డిలు హాజరయ్యారు. కొత్త చట్టంపై వివరించేందుకు నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భువని సునీల్ కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936 నుంచి ఇప్పటి వరకు (6) భూ చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. పాత చట్టాల్లో ఉన్న మంచి విషయాలను ప్రాతిపదికగా భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా కొత్త చట్టం ఉంటుందన్నారు. అనంతరం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ కొత్త భూహక్కుల చట్టం ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. 1853లో అప్పటి నవాబు సాలార్జన్ భూ పట్టాలు ఇవ్వడం జరిగిందని, అలాగే ఎవరెస్ట్ చేత సర్వే చేయించి చైనా సిల్క్ బట్టపై నక్షా ము ద్రించడం జరిగిందన్నారు. భూ రికార్డుల పట్ల అధికారులు తప్పులు చేయొద్దని చిన్నారెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయ భూములు అనేకం ఉన్నాయని, కొత్త చట్టం ద్వారా భూ హక్కులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ ప్రజాభిప్రాయం సేకరించి చేసిన చట్టాల ద్వారా మేలు జరుగుతుందన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శాశ్వత భూసమస్యల పరిష్కారానికి కొత్త చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, మున్సిపల్ చైర్మన్ మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్, సీ సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

రికవరీ యాక్ట్‌పై అవగాహన ఉండాలి

వనపర్తిటౌన్, ఆగస్టు 24 : తాసీల్దార్లు రెవెన్యూ రికవరీ యాక్ట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాసీల్దార్లకు రెవెన్యూ రికవరీ యాక్ట్‌పై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని ఎవ్వరైన సకాలంలో చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా అతని నుంచి రికవరీ చేసే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంటుందని, రికవరీ యాక్ట్‌పై ప్రతి రెవెన్యూ అధికారికి అవగాహన ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులు సరైన పంచనామా చేసి నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా కొత్త ఓటర్ల వివరాలు సేకరించి రికార్డులను సరిచేయాల్సి ఉంటుందని చెప్పారు. 2008 జనవరి 1 కంటే ముందు జన్మించిన వారందరినీ ఫారం 6 బీఎల్‌వోల ద్వారా ఓటు హక్కు నమోదు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, తాసీల్దార్లు ఉన్నారు.

ప్రాజెక్టుల పరిశీలన

గద్వాల, ఆగస్టు 24 : ధరూర్ మండలంలోని జూరాల ప్రాజెక్టుతోపాటు గుడ్డెందొడ్డి రిజర్వాయర్, గట్టు లిఫ్ట్ ఇరిగేషన్, పంపుహౌస్‌లను శనివారం కలెక్టర్ సంతోష్ సంబంధిత ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుతో పాటు ఆయా రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం వివరాలు, పంటలకు నీటిని విడుదల చేసే విధానం, వానకాలం, యాసంగి పంటలకు నీరు అందించే వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.658 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి నిల్వ 9.481 టీఎంసీలుగా ఉన్నాయని తెలిపారు. అల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి నీటి విడుదల తర్వాత అధికారుల అనుమతిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు చెప్పారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం 37వేల క్యూస్కెల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ నెట్టెంపాడ్ లిఫ్ట్, ద్వారా కాల్వలకు నీటిని విడుదల చేసే పంపింగ్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ప్రాజెక్టు స్టేజ్-1, స్టేజ్ పంప్‌హౌస్‌లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ అధికారులు రహీముద్దీన్, జుబేర్, ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

గద్వాల : లిఫ్ట్ ద్వారా కాలువకు నీటిని విడుదల చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేలా చూడాలి

• ఎస్పీ రావుల గిరిధర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, ఆగస్టు 24 : కోర్టులో చార్జ్‌షీట్ వేసిన ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు డ్యూటీ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకమన్నారు. కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫోక్సో కేసులో పది సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని, ఈ సందర్భంగా సహకరించిన కోర్టు అధికారులు తిరుపతి, కానిస్టేబుల్ రమేశ్‌నాయక్, మదనాపురం కానిస్టేబుల్ మన్నెంకొండ, పెబ్బేర్ కానిస్టేబుల్ ఖలీద్‌లను ఆయన అభినందించారు. కోర్టు డ్యూటీ చేసే సిబ్బంది, అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పోలీస్ అధికారులు వెంకటస్వామి, కోర్టు డ్యూటీ సిబ్బంది, ఉన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

సమావేశంలో మాట్లాడుతున్న గంటా కవిత

గట్టు, ఆగస్టు 24 : తల్లిదండ్రులు తమ పిల్లల బాగోగులను మాత్రమే చూస్తూ గడపక తమ బాగుపై కూడా దృష్టి సారించాలని సీనియర్ సివిల్ జడ్జి గంటా కవిత తెలిపారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా స్థానిక రైతువేదికలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై వృద్ధులు, మహిళలనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు ఆస్తులను తమ సంతానానికే ధారాదత్తం చేస్తూ తాము ఇబ్బందులు పడుతుండడం దురదృష్టకరమన్నారు. వయోవృద్ధులు కొత్త చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై కేటీ మల్లేశ్, మహిళా సమాఖ్య మండలాధ్యక్షురాలు సత్యకళ, ఐకేపీ సీసీ జ్యోతి, మాజీ వార్డు సభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అమరచింత, ఆగస్టు 24 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా లేబర్ అధికారి వేణుగోపాల్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై వ్యవసాయ, కార్మిక, వివిధ రంగాల్లో పని చేస్తున్న కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆజయ్, రమేశ్, వెంకటేశ్, రఫీ ఉన్నారు.

ధరణి ఎత్తివేస్తే రైతులకు ఇబ్బందులే

కొత్తకోట, ఆగస్టు 24 : ధరణి ఎత్తివేస్తే రైతులకు ఇబ్బందులు తలెత్తుతాయని శనివారం అదనపు కలెక్టర్ నగేశ్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ మాత పేరుతో ధరణి ఎత్తివేస్తే సమస్యలు తలెత్తుతాయని, సులువుగా రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశాన్ని పాత విధానం కొనసాగితే ఘర్షణలు తలెత్తుతాయన్నారు. ప్రభుత్వానికి ధరణి వల్లే లాభాలు జరుగుతాయని వినతిలో పేర్కొన్నారు.

ఇంటర్ అర్హతతోనే ఉద్యోగ అవకాశాలు

వనపర్తి టౌన్, ఆగస్టు 24 : ఇంటర్ అర్హతతోనే హెచ్‌సీఎల్‌లో ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నాయని ఇంటర్ జిల్లా విద్యా శాఖాధికారి అంజన్న అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఒకేషనల్‌లో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఈ జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 8317638406 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వర్షం కోసం ఎద్దుల కాడిలతో ఊరేగింపు

స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న పొగుంట గ్రామస్తులు

వడ్డేపల్లి/కేటీదొడ్డి, ఆగస్టు 24 : వర్షం కురవాలని కోరుతూ వడ్డేపల్లి మాధవస్వామి గట్టుపై శనివారం రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నిండు జలాలను తీసుకొని ఎడ్ల బండిపై పెట్టుకొని ఎడ్ల కాడిలతో రైతులు పాదయాత్రగా కొంకలలోని ఆంజనేయస్వామి ఆలయానికి తరలివెళ్లి పూజలు నిర్వహించారు. అదేవిధంగా కేటీదొడ్డి మండలంలోని లక్ష్మీవేంకటేశ్వరుడి ఆలయంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని పొగుంట గ్రామానికి చెందిన రైతులు కాడెద్దుల బండ్లతో కృష్ణనది జలాలను తీసుకొచ్చి శనివారం స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో వడ్డేపల్లి సూరి, పెద్ద య్య, హనుమంతు, మాధవరావు, మద్దిలేటి, చిన్న మాదన్న పాల్గొన్నారు.

చిన్నోనిపల్లిని సందర్శించిన ఆర్డీవో

గట్టు, ఆగస్టు 24 : మండలంలోని చిన్నోనిపల్లిని గద్వాల ఆర్డీవో రాంచందర్ స్థానిక తాసీల్దార్ సరితారాణితో కలిసి శనివారం సందర్శించారు. రిజర్వాయర్ నుంచి నీటిని బయటకు పంపించడానికి కాల్వ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. కాగా పనులను లింగాపురం రైతుల అడ్డుకోగా, వారితో ఆర్డీవో మాట్లాడి వారిని ఒప్పించి పనులు ప్రారంభించే లా చర్యలు తీసుకున్నారు. కాల్వ తీసే పనులు ప్రారంభమయ్యాయి. కాగా పనులు పూర్తయితేనే రిజర్వాయర్‌లోని నీల్వ బయటకు వెళ్లి చిన్నోనిపల్లి గ్రామానికి నీరు చేరకుండా ఉంటాయి. కాగా చిన్నోనపల్లి గ్రామస్తులు ఇంకా భయాందోళనలోనే ఉన్నారు. ఏ సమయంలో ఏ ఇబ్బంది తలెత్తుతుందోనని వారు వాపోతున్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఆర్ ఏఈ ఉపేందర్, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

అయిజ, ఆగస్టు 24 : వానకాలంలో సాగు చేసిన పంటలను పాలెంకు చెందిన కేవీకే, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. శనివారం ఏవో జనార్దన్ ఆధ్వర్యంలో అయిజ, పర్దీపురం, వెంకటాపూర్ గ్రామాల్లో కంది, వేరుశనగ, సజ్జ, కొర్ర, మిరప, మినుము, పత్తి, పంటలను పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట ఎదుగుదల, తెగుళ్ల నివారణపై పరిశీలన చేసినట్లు ఏవో తెలిపారు. మినుములో లద్ది పురుగుల తీవ్రత ఎక్కువగా ఉందని వాటి వాటి నివారణ కు వ్యవసాయ అధికారుల సూచనలతో క్రిమిసంహారక మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశిభూషన్, శంకర్, రామిరెడ్డి, ఉన్నారు.

వైద్య శిబిరంలో మందుల పంపిణీ

పెబ్బేరు, ఆగస్టు 24 : జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆయుష్ శాఖ వారు పెబ్బేరు మండలం రాంపురంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 95 మంది రోగులను పరీక్షించి తగు వైద్య సహాయం అందజేసినట్లు మందులు పంపిణీ చేసినట్లు వైద్యురాలు వసుందర తెలిపారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టులు గోపాల్‌గౌడ్, సురేందర్, ఏఎన్ఎం వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీయర్ కార్యవర్గం ఎన్నిక

వనపర్తిటౌన్, ఆగస్టు 24 : వనపర్తి జిల్లా లైసెన్స్ ఇంజినీర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం వనపర్తిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నందకుమార్, ప్రధాన కార్యదర్శిగా గుండ్రాతి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పూరి పాండు, రంగయ్యశెట్టి, ఎండీ ఇమ్రాన్, కోశాధికారిగా జీఎం ముజీబ్, గౌరవ అధ్యక్షుడిగా ఉదయ్ భాస్కర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా తాజుద్దీన్, విష్ణు, హకీం, మురళి, కార్య నిర్వాహక కార్యదర్శులుగా జుబేర్ గోపాల్, జ్ఞానేశ్వర్, నితిన్, సాయి, సలహాదారు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలి

గద్వాలరూరల్, ఆగస్టు 24 : ప్రతిభవంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేవిధంగా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా యువజనుల క్రీడాశాఖ అధికారి బీఎస్.ఆనంద్ అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో గద్వాల మండల స్థాయి 68వ ఏజీఎఫ్ పాఠశాల క్రీడాశాఖ సమ్మ్య ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో క్రీడాకారులకు కొదువలేదన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు క్రమశిక్షణతో ప్రతిభ కనపరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, కేజీబీవీ పాఠశాల నుంచి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అండర్-14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ హైమావతి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సురేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, శ్రీనివాసులు, నాగేశ్ బాబు, అనూష, సతీశ్ కుమార్, రజిని కాంత్, నర్సింహరాజు, స్రవంతి, స్వాతి, నర్సింహులు, భరత్ పాల్గొన్నారు.

బాలలు సురక్షిత వాతావరణంలో పెరగాలి

ధరూరు, ఆగస్టు 24 : బాలలందరూ సురక్షిత వాతావరణంలో పెరగాలని బాల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పేరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో చిన్నారులు సేచ్చా వాతావరణంలో పెరగాలన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేశ్, సఖి సెంటర్ ప్రతినిధులు కవిత, సరోజ, చిట్టమ్మ, సరాగిని, నర్సింహులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కరపత్రం విడుదల

ధరూరు, ఆగస్టు 24 : రైతుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతు రుణమాఫీలో అంక్షలు లేకుండా మాఫీ చేయాలని తెలంగాణ రైతాంగ సమితి నాయకుడు గోపాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతు సమస్యలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాజెక్టులపై దృష్టి సారించి రైతులకు సాగునీరు అందించాలన్నారు. రైతు సమస్యలపై ఈనెల 28న నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాజన్న, లక్ష్మన్న, బొడ్డన్న, గోకారన్న, అయ్యన్న, కర్రె న్న, గోవిందు, రాముడు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

గట్టు, ఆగస్టు 24 : మండలంలోని మాచర్ల జెడ్పీహైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిర్మల తెలిపారు.

కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, ఇన్‌చార్జి హెచ్ఎం రఘు, పీడీలు బషీర్, రాములమ్మ, జగదీశ్, రఘు, మల్లేశ్వరి, స్వప్న, నర్సింహా పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వడ్డేపల్లి, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని కృష్ణ చైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ మొయిన్ పాషా ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు పాటలు పాడుతూ ఉట్టిని పగలకొట్టి ఆకట్టుకున్నారు. పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిజలో..

అయిజ, ఆగస్టు 24 : మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్